# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# కాంగ్రెస్ వస్తే భూముల ధరలు ఢమాల్

ఓ వైపు కరెంట్ కోతలు.. మరో వైపు ధరణి ఎత్తివేత సంకేతాలు

కాంగ్రెసోళ్ల మాటలను తలుచుకుంటూ దిగాలు పడుతున్న రైతులు



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి తీసేసి దాని స్థానంలో భూమాత పోర్టల్ పెడతామని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలతో మళ్లీ కాలమ్స్‌తో తిప్పలు పడాల్సిందేనా? అని రైతుల ఆందోళన.. కౌలు రైతులకు రైతుబంధు ఇస్తామన్న భట్టి మాటలతో పట్టాదారుల్లో గుబులు.. 24 గంటల కరెంట్ వద్దు 3 గంటలే సరిపోతది అన్న రేవంత్ మాటలతో పొలం పారేదెట్లా అనే బాధ.. రైతుబంధు దుబారా అంటున్న ఉత్తమ్ మాటలతో ఆవేదన.. ఇవీ రైతుల మదిని తొలుస్తున్న చిక్కు ప్రశ్నలు. పదేండ్లుగా వ్యవసాయ రంగంలో ఎన్నో కొత్త కోణాలు, మార్పులు, ఆవిష్కరణలు చేస్తున్న క్రమంలో మేం అధికారంలోకి వస్తే అన్నదాతపై ఉన్న కసిని ఎల్లగక్కే మాటలు రైతుల గుండెల్లో గుబులు రేపుతున్నాయి. ఇంత కసి ఉన్న కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏంటి అనే పరిస్థితిలో అల్లాడుతున్న అన్నదాతల హృదయాలు మరోసారి కేసీఆరే అంటూ ఆరాటపడుతున్నాయి.

– నల్లగొండ, నవంబర్ 29



## కాంగ్రెస్ పాలనలో కడుపు మాడ్చుకున్నం

కాంగ్రెస్ పాలనలో చాలీచాలని కరెంటు ఇచ్చి మా బతుకులు ఎండబెట్టుకున్నాం. తెలంగాణ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో నిరంతరం కరెంటు, రైతు బంధు అందించడంతో మా మధ్య తరగతి కుటుంబాలు కడుపు నిండా తిండి తింటున్నాయి. మళ్లీ కాంగ్రెస్ పాలన మాకొద్దు. అధికారంలోకి రాకముందే రైతులకు 3 గంటల కరెంటు చాలు అంటున్నారు. అధికారంలోకి వస్తే మళ్లీ చీకటి బతుకులే అవుతాయి. కాంగ్రెస్ పార్టీ వద్దు, రేవంత్‌రెడ్డి అసలే వద్దు. రైతుల బాధలు తెలిసిన నాయకుడు కేసీఆర్ సారే కావాలి.

–శివర్ల పర్వతాలు, తీదేడు, చింతపల్లి మండలం

## భూముల ధరలు పడిపోతయి



కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధును కౌలు రైతులు, రైతుల్లో ఒక్కరికి మాత్రమే ఇస్తామని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. దాంతో వారి మధ్య మధ్యన గొడవలు జరిగి శాంతిభద్రత సమస్యలు తలెత్తుతాయి. కాంగ్రెస్ నాయకులను నమ్మి వ్యవసాయం చేయడం కష్టమే. భూముల ధర కూడా భారీగా పడిపోతాయి. సీఎం కేసీఆర్ పాలనలో పుష్కలంగా సాగునీరు, 24 గంటల కరెంటుతోపాటు రైతుబంధు, రైతుబీమా ఇస్తుండడంతో భూముల ధరలు భారీగా పెరిగి రైతులు భరోసాతో బతుకుతున్నారు. రైతుబంధు రైతులకు ఎంతగానో ఉపయోగపడింది. మళ్లీ కాంగ్రెస్ వస్తే రైతులు ఆర్థికంగా చితికిపోయే ప్రమాదం ఉంది. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పి రైతులంతా బీఆర్‌ఎస్‌కు మద్దతుగా నిలువాలి.

–బెజ్జంకి భిక్షం, కూరెళ్ల, ఆత్మకూరు(ఎం)

## కాంగ్రెస్ వస్తే బతుకులు ఆగమే



కాంగ్రెస్ మోసకారి ప్రభుత్వం. ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి మాట మార్చి రైతుబంధును భూమి యజమాని లేదా కౌలు రైతు ఇద్దరిలో ఒకరికే ఇస్తామని చెప్పడం ఆయన మోసకారితనాన్ని బయటపెట్టింది. మొన్నటి వరకు ఇద్దరికి ఇస్తానని చెప్పి.. మళ్లీ ఎవరికో ఒకరికే ఇస్తామని మాట మార్చిండు. ఓట్లు కాకముందే ఇట్ల ఉంటే కర్మగాలి వీళ్లు గెలిస్తే ఆరు గ్యారంటీలు కాదు కదా ఒక్కటి కూడా అమలు చేయరు. వీళ్లని నమ్ముకుంటే నట్టేట మునుగుడు ఖాయం. రైతుల బతుకులు ఆగమైతయ్. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంటు ఇస్తున్న కేసీఆర్ సార్‌నే మళ్లీ గెలిపించుకోవాలి.

–ముప్పిడి సత్తయ్యగౌడ్, రైతు, పెద్దకొండూర్, చౌటుప్పల్

## వ్యవసాయం కుప్పకూలే ప్రమాదం..



కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మ్యానిఫెస్టోలో ధరణి ఎత్తివేసి భూమాత పేరుతో ప్రకటించిన భూ క్రమబద్ధీకరణకు సంబంధించి శాస్త్రీయ విధివిధానాల్లో స్పష్టత లేదు. గతంలో మాదిరిగా పట్వారీ అజమాయిషీ పెరిగితే రైతులకు భూమిపై భరోసా తగ్గుతుంది. రెవెన్యూ వ్యవస్థలో అనేక అక్రమాలకు తెర లేపినట్లు అవుతుంది. భూముల క్రయవిక్రయాల్లో పారదర్శకత లోపిస్తుంది. ప్రస్తుతమున్న ధరణినే కొనసాగించాలి. దాంతోనే భూములకు భద్రత ఉంటుంది. 24 కరెంటు, రైతుబంధు ఇస్తూ రైతులను రాజు చేయాలని చూస్తున్న కేసీఆరే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

–ఐతరాజు కృష్ణయ్య, రైతు, కొప్పోలు, గుర్రంపోడు



## కాంగ్రెసొస్తే వ్యవసాయం పడకే..

సీఎం కేసీఆర్ అందిస్తున్న 24 గంటల కరెంటు, రైతు బంధు, సకాలంలో ఎరువుల పంపిణీ, ధరణితో రైతుల భూములకు భద్రత ఏర్పడింది. ఇప్పుడిప్పుడే వ్యవసాయం అభివృద్ధి చెందుతున్నది. ఆన్‌లైన్‌లో భూములు కనిపిస్తుండడంతో కార్యాలయాల చుట్టూ తిరుగకుండా అన్ని పథకాలు అందుతున్నాయి. భూముల ధరలు భారీగా పెరిగాయి. ఒక్కప్పుడు ఎకరం లక్షల్లో ఉంటే ఇప్పుడు కోట్లలో పలుకుతున్నాయి. రైతులకు మేలు చేసే ధరణి ఎత్తివేసి రైతులను వీధిన పడేయాలని కాంగ్రెస్ పార్టీ చూస్తున్నది. కాంగ్రెస్ వస్తే వ్యవసాయం పడకేయడం ఖాయం.

–చిలుక మల్లయ్య, రైతు, కుర్రారం, రాజాపేట

## కాంగ్రెస్ వస్తే కొత్త పంచాయితీలు వస్తాయి



కాంగ్రెస్ పార్టీ అధికారంలోకొస్తే కౌలుదారీ చట్టం తీసుకొస్తామంటున్నది. దాంతో తెలంగాణలో పట్టాదారు రైతులు, కౌలురైతుల మధ్య కొత్త పంచాయితీలు వస్తాయి. పట్టాదారులకు ఇవ్వకుండా కౌలు రైతులకు మాత్రమే రైతు బంధు ఇస్తామంటున్నారు. కాంగ్రెస్ నాయకుల ప్రకటనలతో పట్టాదారు రైతుల్లో భయం మొదలైంది. భూ యజమానులు ఎవరూ తమ భూములను కౌలుకు ఇవ్వడానికి ఒప్పుకోరు. కౌలురైతు, పట్టాదారు రైతు మధ్య ఏనాడూ రాతపూర్వక ఒప్పందాలు లేవు. కౌలు చట్టం అమల్లోకొస్తే రాతపూర్వక ఒప్పందాలు తప్పనిసరి కావాల్సిందే. కౌలు చేసే వారి పేర్లను భూ రికార్డుల్లో ఎక్కిస్తే భవిష్యత్తులో సమస్యలు వస్తాయి. ధరణి వచ్చిన తరువాత రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు నిమిషాల వ్యవధిలో జరుగుతున్నాయి. భూములకు సంబంధించిన కేసులు తగ్గుముఖం పట్టాయి. పటేల్, పట్వారీ వ్యవస్థ ఉన్నప్పుడు వందల సంఖ్యలో భూ కేసులు నమోదయ్యేవి. రైతులు భూ సమస్యలపై రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసేవారు. ఇప్పుడు కార్యాలయాలకు వెళ్లకుండా ధరణితో సమస్యలు, కేసులకు చెక్ పెట్టారు. ధరణిలో ప్రభుత్వం ఎప్పటికప్పుడు మార్పులు చేర్పులు చేస్తూ వస్తున్నది. ధరణి లాంటి మంచి కార్యక్రమాలను ఆహ్వానించాలి తప్ప.. బురదజల్లే ప్రయత్నం చేయొద్దు.

– పేర్ల కృష్ణకాంత్, హైకోర్టు న్యాయవాది, నకిరేకల్ మండలం

## కాంగ్రెస్‌ను నమ్మే రోజులు పోయినయి



రైతులు కాంగ్రెస్ నాయకుల మాటలను, వారి ప్రభుత్వాన్ని నమ్మే రోజులు పోయినయి. మళ్లీ రైతులను నమ్మించి మోసం చేయాలని చూస్తున్నరు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నన్ని రోజులు రైతులకు 24 గంటల కరెంటు ఇవ్వాలన్న ఆలోచనే చేయలేదు. కనీసం రైతు చనిపోతే ఆ కుటుంబం ఎలా ఉందని మందలిచే ప్రయత్నమైనా చేయలేదు. కాంగ్రెసోళ్లకు ఎన్నికలు వచ్చినప్పడే రైతులు గుర్తుకొస్తరు. నా ప్రాణం ఉన్నంత వరకు కరెంటు విషయంలో కాంగ్రెస్‌ను నమ్మను. కాంగ్రెస్ వచ్చేది లేదు. సచ్చేది లేదు. సీఎం కేసీఆర్‌తోనే 24 గంటల కరెంటు సాధ్యం. ఆయనకే మా మద్దతు.

–ధనావత్ లక్ష్మా, జటావత్‌తండా, మిర్యాలగూడ మండలం